# సుదినం

## ఉషశ్రీ

ఆ రోజు ఆదివారం ఆఫీసుకు శెలవు. రాజమండ్రి వచ్చి అప్పటికి 15 రోజులయింది. కాని ఎక్కడా ఒక్క రూముకూడా దొరకలేదు. వచ్చినప్పటి నుంచి నాళంవారి సత్రములోనే బస. సర్వీస్ కమిషన్ పరీక్ష ప్యాసు కావటంతోనే రాజమండ్రి సబ్ కలెక్టరు ఆఫీసుకు వేసేరు. మా స్వగ్రామం విజయనగరం. 15 రోజులునుంచి కాళ్లు అరిగేటట్లు తిరుగుతున్నా. ఒక్క రూము కూడా చిక్కలేదంటే ఏమీ ఆశ్చర్యంలేదు కాని చాలా నిరుత్సాహం కలిగింది. యిక ఆ రోజు శెలవుదినం కావటంవల్ల ఎలాగైనాసరే రూము సంపాదించాలనే పట్టుదలతో 10 గంటలకే ఎదురుగావున్న వరదరావు హోటల్లో భోజనంచేసి ఊరుమీద దండయాత్రకు బయల్దేరేను. ఆవూళ్లోనే మా పినతండ్రి కూతురు సరళ వుండాలి అని మా నాన్న ఎప్పుడో చెప్పేరు. ఆమెభర్త స్కూలుటీచరట. కాని ఆయనపేరు మరచిపోయేను. ఆయినపేరు, పూర్తి అడ్రసు వ్రాయమని మా నాన్నకు జాబువ్రాసేను కాని అంతవరకూ జవాబురాలేదు. ఒక ఆడదాని పేరు పట్టుకొని ఆ మగాడిపేరు, అడ్రసు కూపీతీయాలంటే చాల కష్టమనిపించింది. సందులుగొందులు అన్నీ తిరుగుతున్నాను. కాని ఎక్కడా ఖాళీలు వున్నట్లు కనపడటంలేదు. మా సరళను చూసి కూడా అప్పటికే పదు సంవత్సరాలయింది. అంటే ఆమె పెళ్ళయిన తరువాత ఆమెను తిరిగి ఎప్పుడూ చూడలేను. అదే నా చింత. తిరిగి తిరిగి నా కాళ్లు తేలిపోవటం ప్రారంభించేయి. యిక లాభంలేదురా భగవాన్! అని తిన్నగా గోదావరి ఒడ్డుకు దారితీసేను.

అప్పటికే దాదాపు 5 గంటలయింది. ఆ సందు మలుపు తిరిగితే యిక గోదావరి ఒడ్డే. ఏదారీలేకపోతే గోదారే నాగతి అనుకుంటూ కాళ్లీడ్చుకుంటూ చెమటను తుడుచుకుని శరీరాన్ని నడిపిస్తున్నాను. సందుమలుపు దగ్గరికి వచ్చేసరికి అప్రయత్నంగానే నొక మేడ గోడమీదికి చూసేను, యింకేం! నా పంటపండింది. నా తపస్సు ఫలించింది. నేనుతరించేను. గోడమీద ... టులెట్ ... అని బోర్డు వుంది. ఆ మేడకి వీధిగుమ్మం గోదావరిఒడ్డు వైపేవుంది. ఆ మేడలో గదిదొరికితే ఎంతసుఖంగా వుంటుంది అనుకున్నాను. ఆవలిస్తూనే మేడదగ్గరకి వచ్చేను. తలుపులు తెరిచేవున్నాయి. ఎదురుగావున్న వసారాలో ఒక టేబిలు రెండుకుర్చీలు వున్నాయి. ఎక్కడా మనుష్యులున్నట్లు కనపడలేదు. చొరవచేసి వసారాలో ప్రవేశించాను. వసారాలోంచే మేడమెట్లున్నాయి. వసారా ప్రక్కగదికి తాళం వేసివుంది. ఎదురుగా వున్నగది గుమ్మానికి ఒక అల్లిక తెరకట్టివుంది. టేబిలుప్రక్కకు చేరేసరికి తెరలోంచి "ఎవరికోసమండీ" అని ఒకయువతి కంఠం వినిపించింది. ఆయువతి కనపడకపోయినా కంఠాన్నిబట్టి, తెరలోంచి కనపడుతున్న గులాబీరంగు చీరనిబట్టి ఆమె 20 సం॥ల యువతి అయివుంటుందని వూహించుకున్నాను. కొంచెం తమాయించుకొని, "ఈ రూములో మేడ అద్దెకిస్తారేమోఅని..." యింకాయేమో చెబుతున్నాను. తెరలోంచి ఫక్కున నవ్విందామె. తరువాత కిలకిల నవ్వటం ప్రారంభించింది. నాకు ముచ్చెమటలు పోసినై. మర్యాదలేకుండా ఆమె ఎందుకు నవ్వుతోందా అనికోపంకూడా వచ్చింది. "రూములో మేడ అద్దెకివ్వట మేమిటండీ" అని మరల నవ్వింది. అప్పుడు నాపొరబాటును తెలుసుకున్నాను. సిగ్గుపడ్డానుకూడా మేడలో రూముఅనటానికి బదులు. రూములో మేడ అన్నాను. ఎంత తెలివి తక్కువగా వ్యవహరించేనా అనుకున్నాను. "అయితే ఏమ

న్నారూములు ఖాళీవున్నాయండీ" అన్నానుతెగ "కుటుంబాలతో వుండేవాళ్ల కయితే మేడమీద గదులుయిస్తాం, విడిగారూములు యివ్వం, అయినామీరు కాలేజీస్టూడెంటా?" అన్నదామె "అబ్బే లేదండి. ఇక్కడ సబ్ కలెక్టరాఫీసులో పనిచేస్తున్నాను ఏదో కొద్దిరోజులు పోయిన తరువాత మావాళ్ళ నెవళ్ళనైనా తీసుకరావాలి" అన్నాను. "అయితే ప్రస్తుతం యివ్వబడదండి" అందామె. నిలువునా నీళ్లు కారిపోయేను. "మీకభ్యంతరం లేకపోతే యీయింటి యెజమానులెవరో, వారెక్కడున్నారో చెబితే వెళ్ళిపోతాను" అన్నాను చివరికి. "యీయిల్లుమాదే. మావారలా క్లబ్బుకి వెళ్ళేరు. మీకభ్యంతరం లేకపోతే రేపుపుదయం రండి" అందామె "మంచిది" అంటూ బయటికివచ్చేశాను. రూముదొరుకుతుందనే ఆశయింకా నశించలేదు యేమైనాసరే రేపుపుదయం వచ్చి వాకబుచేయాలని నిశ్చయించుకున్నాను. తిన్నగా హోటలుకు చేరుకుని నాల్గు మెతుకులుతిని సత్రంలోకి చేరుకున్నాను. ఉండలేక రెండోఆట సినిమాకివెళ్ళేను. దానితో రాత్రి సుమారు 1గంటలయింది. తెల్లవారినతరువాతకొంచెం ప్రొద్దెక్కి లేచాను. తీరాగడియారం చూస్తే తొమ్మిదిన్నరయింది. 'ఆరేభగవాన్' అనుకున్నాను. యికవిధిలేక అన్నికృత్యాలు తీర్చుకుని హోటలుకు చేరేసరికి పదిన్నరయింది. సరే సాయంత్రం వెళదాంలే రూమ్ కోసం అని భోంచేసి ఆఫీసుకు చేరుకున్నాను.

ఆరోజు మధ్యాహ్నం మా నాన్న దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. మా సరళ భర్తపేరు సత్యనారాయణ అని వ్రాస్తు నామందిమరపుకు నాల్గు చీవాట్లుకూడా వేస్తూ వ్రాసేడు. సరే యికనేం ఆయన వీరేశలింగం హైస్కూలు టీచరట. సాయింత్రం నేరుగా స్కూలుకుపోయి విచారిద్దామనుకున్నాను. ఆఫీసు అయ్యేసరికి సాయంత్రం ఆరున్నరయింది. నన్ను నేనే తిట్టుకుంటున్నాను. యింతలో సుమారు 28 సం|| ల వయసున్న ఒకవ్యక్తి నావద్దకివచ్చి "ఈ ఆఫీసులో సుబ్బారావని కొత్తగా గుమాస్తావచ్చేడట ఆయనను కొంచెం చూపిస్తారా" అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది. ఆవూళ్ళో నన్నెరుగున్న వాళ్ళెవరున్నారా అని. కొంచెం సందేహిస్తూ "నేనేసుబ్బారావుని. మీకేంకావాలి" అన్నాను. ఆయన తెల్లబోయి చూస్తున్నాడు. కొంతసేపటికి చిరునవ్వుతో" ఏమోయ్! నన్ను గుర్తుపట్టలేదా? నేనేనోయ్, మీ సత్యం బావని" అన్నాడు. యికనేం అంతా అయిపోనట్లే- నాకువ్రాస్తూ అతనికికూడ ఒకఉత్తరం వ్రాసేడట మానాన్న కౌగిలింతలన్నీ కట్టలుగట్టి పడేసి యిద్దరం బయల్దేరేం. దారిలో సత్రానికిపోయి కొంచెం డ్రెస్మార్చుకుని వరదరావు హోటల్లో కాస్తకాఫీత్రాగి బయిల్దేరేం. అయిదుసం|| ల క్రిందటి సంగతులు మాట్లాడుకుంటూ నడుస్తున్నాం. క్రమంగా సందులు గొందులు దాటి ఒకమేడ దగ్గర ఆగిపోయేం. "యిదేనోయ్! మాయిల్లు" అన్నాడు సత్యం. నాకు మరీ ఆశ్చర్యం వేసింది. నిన్న సాయింత్రం వచ్చిన దామేడదగ్గరకే నేనాశ్చర్య పోవటం చూసి అతను "ఏంఅలా చూస్తావ్" అన్నాడు. నవ్వుకుని అబ్బే! ఏమీలేదులే, తరువాత చెబుతా నడు" యిద్దరం లోనికివెళ్లేం. స్వతంత్రంగా కుర్చీమీద బైఠాయించేను. మా సత్యం 'సరళా! మీ అన్నయ్య వచ్చేడు. రా" అనిపిలిచేడు. ఆమె బయటికివచ్చి నన్నుచూసి విస్తుపోయింది. ఆమె అలా ఆశ్చర్యపట్టం చూసి సత్యం గాభరాపడ్డాడు. మా సరళ "అన్నయ్యా!" అంది నేను "అవును" అన్నాను. ఈ మేడదగ్గిరకి రావటం తోనే యితను ఆశ్చర్య పోయేడు' ఇతన్నిచూడ్డంతో నే నువ్వాశ్చర్య పోతున్నావు. ఏమిటి సమాచారం, అన్నాడు సత్యం సరళ "అన్నీతరువాత చెబుతా ముందు కాళ్లుకడుక్కొని భోజనానికిరండి" అనిలోపలి కెళ్లింది. యిద్దరం భోజనాలు చేస్తుంటే మా సరళ క్రిందటి రోజున జరిగినదంతా చెప్పి నవ్వటం ప్రారంభించింది. ఇద్దరంకూడా నవ్వుకున్నాం.